# ధర్మసాధని

[బ్రహ్మసాధనాశ్రమ పక్షమున ప్రతిశనివారము ప్రకటింపబడును.]

ధర్మంచర । ధర్మాత్ పరం నాస్తి । ధర్మః సర్వేషాం భూతానాంమధు.

సంపుటము ౧. | కాకినాడ:—శనివారము, డిశంబరు, ౧, ౯౨౧. | చందా సం॥ రు ౩.

సంచిక ౨౮. | | విడిసంచిక అ ౧.


## ఓమ్.

దుఃఖ పడెదను నాకిక త్రోవ యేది
ప్రాణనాయకు నెడబాసి ప్రాణములతో
నందజాలను జనకుని యండజేరి
పాప భయమును నొక్కింత బాపికొందు
హృదయ సంతాప మాదు శోక దావవేదనను
ధన్యవాదము లర్పింతు తాపమయ్యె
మీరుచున్నది పుత్రిని గరుణ గాంచి
కార్య కృత్యుని జేయుము కౌశలుండ!
కన్న బిడ్డని దరిచేర్చి గారవించి
కాంచి పరిపాలనము సేయ గడగు తండ్రి
వదలి పోయిన నాకేమి ఫలము గలదు?
తండ్రి యెడబాటు భరియింప దరమె నాకు?
మిత్రుడందును నా పరమ మిత్రుడందు
చుట్టమందును నాయనుగు చుట్టమందు
యజ్ఞయని కూడ నిన్ను సంబోధనంబు
సేతు! కృపతోడ నీ యొద్ద చేర్చుకొనుము.

వే. వెం.

---

మీ శత్రువులను ప్రేమించుడీ, మిమ్మును ద్వేషించు వారికి మేలు చేయుడి. మిమ్మును శపించు వారిని దీవించుడీ, మిమ్మును నిందించు వారి కొరకు ప్రార్థించుడీ, యితరులు మీకు యెట్లు చేయవలెనని మీరు కోరుదురో మీరు ఇతరులకు అట్లు చేయుడు.

జీసస్.

---

## దాన మహిమ.

—:-:o:-:—

ఈశుండు భువనంబు నిర్మాణమును సేయ
నది నల్లలాడుచు నటు నిటు కదల
దానిని స్థిరముగ నెలకొల్ప భువిలోన
దగిన పర్వతములు తక్షణమె వెడలె
కాన పర్వతములు భువికంటె శ్రేష్ఠమా
పర్వతంబుల కంటె వానిని తొలిచెడి
ఇనుము శ్రేష్ఠంబగు ఇనుమును
కరగించు నగ్ని నంతకంటెను గొప్ప
అగ్నిని చల్లార్ప నమకట్టు జలము
అంతకంటెను గొప్ప యాలోచనను చేయు
జలమును కదలించు చండమారుతము
జలము కంటెను గొప్ప చక్కగ జూడ
భువిని పవనుని కంటె భూరిమా వస్తువు
కలదె యని ప్రశ్నింప కడుభక్తి తోడను
తా జేయు దానంబు గుప్తముగ నుంచి
తద్దయు హర్షించు దానశీలుండు
అందరి కంటెను కడు గొప్పయగును
దాన మహిమను దెల్పె తగు చాతురిమతో
మహిత విఖ్యాతుండు మహమ్మదు ఘనుడు
కాన దానము చేసి దైవంబు గనుము.

ఇ. సు. కృ.

# తృతీయ ఆదిమాంధ్ర మహాజన సభ.

—:o:—

ఈ మహాసభ నవంబరు ౨౭ వ తేదీన గుంటూరునందు జరిగెను. కృష్ణా, గుంటూరు, గోదావరి, మండలముల నుండి సుమారు ౧౦౦౦ మంది ప్రతినిధులు విచ్చేసిరి. ఆంధ్రరాష్ట్రమున ౧౨ మండలములు గలవు. వానిలో 3 మండలముల నుండియే ప్రతినిధులు వచ్చిరి. ఆ మూడు మండలములలో గూడ ఎన్నియో తాలూకాలు గలవు. ఎన్నియో గ్రామములు గలవు. ప్రతి గ్రామమునుండి గాని, అథవా తాలూకాకు ఒక్కొక్కరి చొప్పున గాని ప్రతినిధులు వచ్చియుండలేదు. వచ్చిన ప్రతినిధులందరు ముఖ్యముగా అయిదు ప్రదేశముల వారనియే చెప్పవచ్చును. అవి యెవ్వియన ౧. రాజమహేంద్రవరము, ౨. ఏలూరు, 3. బందరు, ౪. గుడివాడ, ౫. పెదపాలెము. ఈ అయిదు స్థలములనుండి అధిక సంఖ్యాకులు వచ్చుటయు సమంజసము. ఈ ప్రదేశములలోనే పంచమోద్ధరణమునకై ప్రత్యేకముగా కృషి చేయబడుచున్నది. రాజమహేంద్రవరమునందు శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహముగారు శ్రీ రామమోహనుని పేరిట పంచముల నిమిత్తము ఒక పాఠశాలను నెలకొల్పి వారి అభివృద్ధి కొఱకై పాటుపడుచున్నారు. ఏలూరునందు శ్రీ వెల్లంకి కృష్ణమూర్తిగారు వారి అభ్యున్నతికై కృషి చేయుచున్నారు. బందరునందు శ్రీ వేమూరి రాంజీరావుగారు వారి శ్రేయస్సుకొఱకై యెంతయు ప్రయత్నించుచున్నారు, గుడివాడలో శ్రీ గూడూరి రామచంద్రరావుగరు వారి క్షేమము నిమిత్తమై తమ సర్వస్వమును ధారవోయుచున్నారు. పెదపాలెమునందు శ్రీ నల్లపాటి హనుమంతరావుగారు వారి అభ్యుదయమునకై కష్టించుచున్నారు. ఇట్టిప్రదేశములలో ఆదిమాంధ్రుల సముద్ధరణమునకై పరోపకార పారీణులు పాటుబడుచుండుట కతముననే ఆ ప్రాంతముల నుండి ప్రతినిధులు హెచ్చుగా వచ్చుట తటస్థించినది. కాని యితరభాగముల మాట యేమి? తదితర ప్రదేశములందలి ఆదిమాంధ్రులలో ఇంకను ప్రబోధము కలుగలేదు. స్వార్థత్యాగ శీలురగు మహానుభావులు అన్యప్రదేశములలో గూడ లేకపోలేదు. మన జాతియొక్క అభివృద్ధి ఈ ఆదిమాంధ్రుల అభివృద్ధితో పెనగొనియున్నదని స్పష్టముగా తెలిసికొని వారి శ్రేయోవృద్ధుల నిమిత్తమై పంచమేతరులు తీవ్రముగా కృషి చేయుట అత్యంతావశ్యకము. ఆహ్వాన సంఘాధ్యక్షులగు మాతుక్కి వెంకటేశ్వర్లుగారు సుమారు ఒక గంటసేపు గంభీరముగా ప్రసంగించిరి. పిమ్మట సభాధిపతులయిన శ్రీ కుసుమ వెంకట్రామయ్యగారు భావగర్భితమయిన ఒక చక్కని ఉపన్యాసమొసగిరి. ప్రథమమున వారు తమ పూర్వజుల కీర్తిని కొనియాడి స్వజాతీయులలో ఆత్మ గౌరవమును ఆత్మ విశ్వాసమును పురికొల్ప గడంగిరి. మనము దౌర్భాగ్యులము గాము. సర్వజన నుతిపాత్రులగు వాల్మీకి పరాశరాది మహర్షులు మన కులమున జన్మించిన వారే. అరుంధతి సారంగి మొదలగు పతివ్రతలు మన జాతికి వన్నెదెచ్చిరి. కనక కాళిదాసాది కవీశ్వరులు మన వర్ణమున ఉదయించిరి. నందుడు, తిరుప్పాణి ఆళ్వారులు, రోహిదాసు మున్నగు భక్తులు మన జాతి పవిత్రము చేసిరి. మయుడు మొదలగు శిల్పులును, ఏకలవ్యుడు, కన్నమనీడు, ఆదిగాగల వీరశిఖామణులును మన కులమునకు కీర్తిని గడించిరి. ప్రకృతమున తమ స్థితి కడుంగడు దుర్భరముగా నున్నదనిరి పలసదేశములందలి భారతీయుల అవస్థకంటె మన అవస్థ మిక్కిలి అసహ్యముగా నున్నది. మాకు కడుపునిండ తిన ఆహారము లేదు. ఒడలు నిండ కట్టుకొన గుడ్డలేదు. ఉండ ఇల్లు లేదు. పండ మంచము లేదు. అన్నిటిని మించి మానీడ సోకిన అపవిత్రుల మగుదుమని చెప్పి అగ్రవర్ణులు దూరదూరముగా తొలగుచున్నారు. బుద్ధిమంతుల సహవాసము చేసి బాగుపడుటను అవకాశము లేకుండ జేసినారు అనంతరము వారు తమ కులము యొక్క ఆర్థిక సంపత్తి పెంపొందు మార్గములను సూచించిరి. పాలేరు తనము వలన మనము కేవలము బానిసలమైతిమి ఈ దాస్యము నశింపవలెను. భూఖండముల నెల్ల కొల్లముగా అక్రమించుకొని కష్టించి సేద్యము చేయ మనకు భూస్వాములు జానెడు నేల యైన లేకుండ చేసినారు. పని చేయువానికి తప్పక భూమి యుండవలెను. పండిన పంటలో కొంత భాగమును కచ్చితముగా మన కొసంగవలెను. కూలిచేత జీవనము చేయు మనవారిలో మగవానికి దినమునకు అ. ౦-౧౦-౦ ల చొ॥ స్త్రీకి అ. ౦-౬-౦ ల చొ॥ కూలి నియ్యవలెను. పరపతి సంఘములను స్థాపింపవలయును. మనకు అనుకూలములైన పరతులు కుదురని పక్షమున పాలేరుతనమును మాని మనము నూలు వడకుట, నేత నేయుట, చెప్పులు కుట్టుట మున్నగు స్వతంత్ర వృత్తులలో ప్రవేశింపవలెను. ఇట్టి పని మూలమున కోట్ల కొలదిగా పరదేశములకు పోవు ధన ప్రవాహమును అరిగట్టి మనము బాగుపడి దేశమును గూడ బాగుచేసిన వారమగుదుము. పంచమేతరుల నుద్దేశించి గూడ కొన్ని మాటలు చెప్పిరి. మా స్థితి మిక్కిలి శోచనీయముగా నున్నదని గ్రహించి మమ్ము బాగుచేయుటకై మీరు సాయపడవలెను. అన్యాయమును క్రూరమునైన "అస్పృశ్యత" అనెడు దోషమును మీరు పరిత్యజింపవలయును. మా ఆర్థికాభివృద్ధికి మీరు తోడ్పడవలయును రుష్యాలో జరిగిన కష్టములు మన దేశమును చుట్టుకొనకుండ మీరు చేయవలెను. ఉదారబుద్ధితో మీరు మా అభివృద్ధికి తోడ్పడరేని మనము బ్రిటిషు ప్రభుత్వము పట్టున ప్రయోగించుచున్న అసహాయాయుధమునే మీయెడల మా వారు ప్రయోగింపదలచి యున్నారని మీరు తెలిసికొనవలెను. స్వజాతీయులకు గూడ కొన్ని హితముల బోధించిరి. పశువుల శవములను భుజింపగూడదు. గోమాంసమును సూకర మాంసమును భక్షించుట మానవలెను. మనము శాకాహారుల మగుట శ్రేయస్కరము. అగ్రవర్ణముల వారు మనలనెట్లు చూచుచున్నారో అట్లె మనముగూడ దెక్కలవారిని, పాకివారిని తక్కువగా చూచుకొనుచున్నాము. మాదిగల కంటె తాము ఎక్కువ వారమని మాలలు తలంచుచున్నారు. మనము క్రిందివారిని అస్పృశ్యులనుగా నెంచునంత వరకు బ్రాహ్మణాది జాతులవారిని అంటరాని తనమును విడువుడని అడుగుటకు మనకు యోగ్యత లేదు. మనము బీదవారము. కాంగ్రెసు సభలలో రుసుమి

చ్చి చేరజాలము. మన విషయమున ఆ సమయము ఏ కాలికో అధికాంకో తగ్గించవలెను. కాంగ్రెసు సంఘములలో మన జనసంఖ్యకు తగిన ప్రాతినిధ్యమును ఇయ్యవలెను. అధ్యక్షుని ఉపన్యాసము ముగిసిన పిమ్మట తమజాతి అభివృద్ధికి తోడ్పడు కొన్ని తీర్మానములను వారు కావించియుండిరి. తమ జనసంఖ్యకు తగిన ప్రాతినిధ్యము, తమకు కాంగ్రెసు సంఘములలో నుండవలెననియు, అస్పృశ్యతాదోషము పోని స్థలములలో శాసనోల్లంఘనము ప్రారంభించుటకు పంచములు నిరోధింపవలెననియు, మద్యపానాది దురాచారములను మానవలెననియు, మొదలుగా గల తీర్మానములు చేయబడెను.

## అస్పృశ్యతా నివారణ సభ.

రెండవ దినమున అస్పృశ్యతా నివారణ సభ జరిగెను. ఈశ్వర సర్కారులనుండి సుమారు ౨౦౦ మంది ప్రతినిధులు వచ్చిరి. దాదాపుగా వెల్లరును ఖద్దరు గుడ్డలనే ధరించియుండిరి. శ్రీ భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు సభాధిపత్యమును వహించిరి. యుక్తియుక్తమును, మనోహరమునగు నొక మహోపన్యాసమును వారు కావించిరి. అస్పృశ్యత యుండవలెనని చెప్పు వారి వాదముల దౌర్బల్యమును వెల్లడించిరి. మనము వారు అశుభ్రముగా నున్నారమని చెప్పుదుము. పంచముల గూడెములందు స్థల మెంత సంకుచితముగా నుండునో చింతింపుడు. వారు నివసించు గుడిసెలు ఎంత ఇరుకుగా నుండునో ఆలోచింపుడు. అట్టి స్థితిలో భార్యాపుత్రులతో కాపురము చేయవలసి వచ్చిన వారు శుచిగా నుండదలచినను ఎట్లుండగలరు? పైగా వారి దారిద్ర్యము ఆ అశుభ్రతకు మఱింత తోడ్పడుచున్నది. వారి నివేశన స్థలములను అధికము చేయుటకై ప్రయత్నించుచున్నామా? వారి పేదరికమును పోగొట్టుటకై కృషి సలుపుచున్నామా? శుభ్రముగా నుండుటకు తగిన అవకాశమును కల్పింపక వారిని నిందించు లాభమేమి? అస్పృశ్యత హేతువులను నిలుచునది గాదు. బ్రిటిషు వారు మన యెడ నెట్లు క్రూరముగా వర్తించుచున్నారో మనము గూడ వారి పట్లను నట్లే వర్తించుచున్నాము. అందుచేతనే మన జాతికే ఈ అంటరాని తనము కళంకదాయకమని చెప్పి స్వరాజ్య సంపాదనమునకై శాసనోల్లంఘనమునకు గడంగుటకు పూర్వము తత్కార్యమునకు పూనుకొను వారు ఈ దోషమును పోగొట్టుకొనవలెనని అఖిలభారత కాంగ్రెసు సంఘమువారు విధించియున్నారు. భేదోపాయములచే మన ప్రభుత్వమువారు రాజ్యమును పాలించుచున్న సంగతి మనము మఱవగూడదు. మొదట హిందువులకును మహమ్మదీయులకును వైషమ్యములను గలిగించిరి. అది యెట్లో సర్దుకొంటిమి, తరువాత మన రాజధానిలో బ్రాహ్మణులకు బ్రాహ్మణేతరులకును భేదములను కల్పించిరి. ఇవి యిట్లుండగానే బ్రాహ్మణేతరులం విజృంభింపకుండునట్లు వీరికిని పంచములకును తగాదాలను పురికొల్పుచున్నారు. గత ౫ మాసములలో చెన్నపట్టణములో జరిగిన అల్లరులే ఇందుకు తార్కాణము. మనము ఇట్టి భేదోపాయ ప్రయోగమునకు తావియ్యగూడదు. మనలో గల లోపముల సవరించుకొని ఐకమత్యమున మెలంగవలెను. అస్పృశ్యతను పోగొట్టవలెను. హిందూ సంఘము మనకీ విషయమున అడ్డు పెట్టునని తలంచుట పొరబాటు. మెత్తదనమని అనుడీ ఔదార్యమని అనుడీ ఏ మన్నను హిందూ సంఘమునకు ఒక విధమయిన కలుపుగోలు తనము కలదు. అస్పృశ్యత గానీ, వితంతూద్వాహము గానీ, యువతీ వివాహము గానీ, ఇట్టి యే సంస్కారము నైనను చట్టములో పెట్టినపుడు ఆచరింపవగదనే ఎల్లరు తీర్మానింతురు. కాని సంస్కారము జరుగుటకు అడ్డుపెట్టువారు ఎక్కువ మంది యుండరు. అట్టి సంస్కర్తలతో కలిసి భోజనము చేయుటకు వచ్చువారు గూడ పెక్కుమంది యుందురు. కావున కాంగ్రెసు యొక్క ఆదేశము ననుసరించి ఈ దురాచారమును వారు పెట్టిన గడవు లోగానే మానివేయుట ఆవశ్యకము. అనంతరము తద్విషయక తీర్మానము సభలో ప్రవేశపెట్టబడెను. అంటరాని తనమును పాటింపగూడదని తీర్మానమునందుండగా, అది చాలదనియు, చెఱువులలోను, బావులలోను, నీళ్ళు తోడుకొనుటకును, దేవాలయములలో ప్రవేశించుటకును ఆదిమాంధ్రులకు అవకాశమును కల్పింపవలెనని ఒక సవరణను గూడూరు రామచంద్రరావుగారు ఉపపాదించిరి. దేవాలయముల లోనికి రానిచ్చు విషయమై తీవ్ర చర్చ జరిగెను. తుదకు సవరింపబడిన తీర్మానము నైకకంఠముగా ఒప్పుకొనబడెను. దేశములో కల్గిన ప్రబోధమును ఈ తీర్మానము వెల్లడించుచున్నది.

పా. స.

---

# ఆంధ్ర విశ్వవిద్యాలయము.

—:o:—

ఒక ప్రత్యేక యాంధ్ర విశ్వవిద్యాలయము చెన్నపురి రాజధానిలో సంస్థాపింపబడవలెనని 2 తేదిని జరిగిన శాసనసభలో మ|| రా|| ఎం. సూర్యనారాయణ పంతులుగారు ఉపపాదించి యుండిరి. ఒక యుపసంఘము నేర్పరచి యావిషయమును గూర్చి భోగట్టా జరుగుటకుల జేయుదుమని దొరతనము వారి పక్షమున దెలుపబడగా నిర్ధారణ ఉపసంహరించుకొనబడి యుండెను. అప్పుడు దొరతనమువారు అనుద్యోగీయులలో 18 మందిని, చెన్నపురి విద్యాశాఖాధిపతి గారిని భోగట్టా కమిటీగా నేర్పరచి యుండిరి. ఇందు 14 గురు ఆంధ్రదేశ నివాసులు. ఆసభకు మ|| ది|| ఎల్. ఏ. గోవిందరాఘవయ్య అవర్గళ్, ఎం. ఎల్. సి గారు అధ్యక్షులుగను మ|| రావుబహద్దరు చింతలపాటి వేంకటసూర్య నరసింహరాజు ఎం. ఎల్. సి గారు కార్యదర్శిగను ఉన్నారు. ఈ కమిటీ వారు ఈ రాజధానిలోని తెనుగు జిల్లాలలో యూనివర్సిటీ యొక్క యగత్యత కలదా, అది యేవిధమైనదిగ నుండవలెను, ఎక్కడ స్థాపింపబడవలెను, దానికి పెట్టుబడి యేలాగు, వ్యాపకత్వ మెంతవరకు, దాని వ్యయమునకు సొమ్ము వచ్చుటయెట్లు మొదలుగా గల విషయములను చర్చింతురు. వీరు 1922 జనవరి 31 తేదీ సరికి తమ రిపోర్టును దొరతనమువారి కప్పగింప గోరబడిరి, బందరు నోబులు కళాశాల యూనివర్సిటీగా జేయబడు మనను వారు మున్న నిశ్చయించిరి.

(రవి,)

సత్యమేవ జయతే

ధర్మసాధని

శనివారము, డిశంబరు, 3, ౧౯౨౧.

## మృత్యువు.

—:о:—:о:—

"ఈ నడుమ మా యింట నొక శిశువు మరణము నొందుట తటస్థించినది. రెండు సంవత్సరములకు లోపు వయస్సు గల బాలుడు. తీవ్రజ్వర పీడితుడయి యెన్ని వారములు పడరాని బాధపడి మృతి నొందెను. చేసిన చికిత్స వల్ల ప్రాణము నిలువక పోవుటయె గాక బాధయైన నిందుకు శాంతింపక పోవుటను చూడగా జనన మరణములనుగురించి యనేక విషయములను దెలిసికొన వలెనని నా మనంబున దోచి తమకీ జాబు వ్రాయుటకు సాహసించుచున్నాను." అని తెలుపుచు నొక సోదరి మాకొక లేఖ వ్రాసెను. ఆమెకు మా సానుభూతి తెలుపుచు మా మిత్రులొకరు పంపిన బేకన్ మహనీయుని మృత్యువ్యాఖ్యను ఈక్రింద పొందుపరచుచున్నాము.

"చావనిన మనుష్యులు భయపడెదరు. కారణము తెలియదు. పసిపిల్లలు బూచులను గూర్చిన కథలకై యెట్లు వెఱుగు పడెదరో యట్లే వీరు దిగ్భ్రమ జెందుచున్నారు. వీరి మగతనమున కిది తగదు. చేయి దెబ్బతినిన నొప్పి కలుగును. దాని నెఱుగుట కంతరింద్రియములు గలవు. మరణకాలమున నంతరింద్రియము లడగును. బాధ గోచరింపదు. పలువురు నడివెడి మాటలందు భయము గలదు కాని నిక్కముగా చావునందు లేదు. యమపురికి ప్రయాణము గట్టుకొన్న నరుని గాంచి చెంతజేరు బంధుమిత్రులు విపరీతముగ వలంతురు. మృత్యువు నోటబడు నా మనుష్యుడటునిటు కదలును. పొరలాడును. కూతలు బెట్టును. మరణ చిహ్నములు గాంచి తక్కిన వారు భయాకులిత మానసులయ్యెదరు గాని వానికేమైన భీతి గలదా?

ఓతో యను ప్రభు సత్తముడు ప్రాణములు పోగొట్టుకొనగా ప్రజలు తమ ప్రాణముల గూడ పోగొట్టుకొనుట కాయత్త పడిరి. ప్రజలకు మరణబాధ మనసునకు వచ్చినది కాదు. రేనిమీది యనపారప్రేమ బాధను సయితము గెలిచెను. దయాశౌచాది సద్గుణములు మానవుల బొందియుండునేని వారెంత మాత్రము చావునకు వగవరు.

రణాంగణమున వీరులు జయాభిలాషతో తమ ప్రాణములను నరకు జేయక ధైర్యముతో పోరు సలిపెదరు. అవమానము పడలేక కొందరు చావునకు సిద్ధపడెదరు. కార్యసిద్ధి బొందలేక కొందరు మృత్యుముఖమున బడెదరు. సత్కీర్తి గనిన చాలునని కొందరసువు బాయుదురు. మనుష్యులేదైన నొక గొప్ప ప్రయోజనము కొరకు పాటుపడినచో వారికి సహజముగా ప్రాణముల మీద తీపి యంతగ నుండదు.

పండితులు మరణింతురు. పామరులు మరణింతురు. రాజులు మరణింతురు. ప్రజలు మరణింతురు. చావునకు గురికానివాడు లేడు. చావు మనుష్యునకు తప్పక సిద్ధించును, వాడు వలదనినను వచ్చును. తప్పించుకొనుట కుపాయము వానికి దోపదు. కావున చావు వచ్చునని నొప్పి బొందరాదు.

చావు పుట్టుకలు సృష్టియందు స్వభావములైనవి. తెలియని వానికి పుట్టుట యనునది కష్టమని తోచును. గిట్టుట యనునది కూడ నట్లే తోచును. సృష్టిధర్మము మిగుల సొగసయినదని సర్వులు పొగడవలెను.

చాలనాళ్ళు బ్రదికిన బాగుండు నని తలచి మధ్య పోయిన వాడు నరకబడిన మనుష్యునితో సమానుడు. ఇచ్ఛలు వానికి దొలగి యుండవలెను. వాని సర్వావయవములు మరణమున కెదురు చూచుచుండవలెను. ఇంద్రియములు తమ కార్యములు దాము నిర్వహించితి మనియు నింక తమకు విశ్రాంతి వచ్చుననియు తృప్తి జెంది యుండవలెను.

ఒకని యుద్దేశము మంచిదయి యుండ దురాత్ములు దానిని గ్రహింప నేరక వానిని దిట్టుదురు. సదుద్దేశ ప్రేరితుడై వాడు మరణము నొందగా నా యుద్దేశము కొంత కాలమునకు బయటపడి వానికి చిరకీర్తి నాపాదించును."

———

# ఏకాంత సేవ.

—:-:○:-:—

ఆత్మావలోకనము చేయుటకు, లోకాతీతుఁడగు లోకైకనాథుని యద్భుత చర్యల గురించి యాలోచించుటకు, అగణిత దురవగాహా హృదయము ముఖమాత్రమైనను గ్రహించుటకు, ఇంతయేల మన జీవితము నవ్యతి మయము చేసికొనుటకు ఏకాంతసేవయే శరణ్యము. అదియే అద్వితీయము ; పని కల్పించుకొనుటకు గాక హృదయమును పశ్చాత్తాప పారావారమున నీదులాడించు గ్రంథముల పఠించిన, నేకాంతసేవకది సాహాయ్యము చేయును. సౌఖ్యమైన కాలము వ్యర్థ పరుపకుండిన, పావన విషయముల గురించి యపారముగ చింతించుటకు వీలగును. మానవగుంపుల విడిచిన గాని యీశ్వరుని హృదయములో చేర్చ వీలుండదు. సంతోషముతో స్వగృహముననే యుండవచ్చును.

ఏకాంతసేవ జేయువాని చిత్తము ప్రశాంతమై యుండవలెను. అప్పుడే యాతఁడు నిర్భయుఁడై నిర్మల మానసుఁడై నిశ్చలుఁడై నిర్మలానందము పొందగలఁడు. అశాంత మానసుఁడు నిర్భయుఁడై యెటులుండగలఁడు? ప్రశాంత మనస్కుఁడు తక్క నితరులు నిర్భయముగ నుండజాలరు. అపవిత్రులకు పవిత్ర మనస్సాక్షి యెక్కడిది? అందుచేతనే యపవిత్రుఁడు నరక బాధ ఈ లోకములోనే పొందుచుండును. పవిత్ర మనస్సాక్షిని గలిగి యుండనివాఁడు పరమానంద మెట్లు పొందగలఁడు? అపవిత్రుఁడు ఎల్లప్పుడును భయవిశ్వాసుఁడే! ఆతఁడు నిర్భయుని వలె నటించినను నది నిర్భయము కాదు. అపవిత్రుల నిర్భయత్వము అహంభావ పూరితమైంది. పావన పురుషుల నిర్భయత్వము దైవభక్తి పూరితమైనది. ఎప్పటికైనను మునుల నా నిర్భయత్వము మోసగించును. మా మోహాయము గలవాని వలె భక్తాగ్రేసరులు నిర్భయత్వము వాగ్దానము జేయుచుండు. మానవ ప్రాణులు సైతము తమకు తోచినది సత్యమనియు దృఢమైన దనియు నమ్మి మోసపోవుట మనము చూచుట లేదా! అందుచేతనే నిర్భయత్వము వాగ్దత్తము చేయఁగూడదు. ప్రేరేపణ (Temptation) బారినుండి సంపూర్ణముగ దూరమున నుండిన గర్వాల గుటయే గాక నిర్భయత్వ పూరిత హృదయులగుదురు. గర్వాలప్పుట తోడనే వారి హృదయము విషమయము మయి పోవును. అప్పుడు అశాంతము వారి కాశ్రయ మగును. వేయేల విశ్వాతీతునిపై నిశ్చల విశ్వాసము విపుల నిర్మల మానసులకు తక్క నితరులకు కానరాదు మన నేమియో తెలియదనియే చెప్పవచ్చును. శిలావిగ్రహముల బూజించిన ముక్తి వచ్చునని తలఁచు మూఢ భక్తులకు ముక్తి యెక్కడిది. వారు మోసపోవుచున్నారు. విఫలీకృత మనోరథులై తప్పదారిని పోవుచున్నారు. అట్టివారికి ఆనంద మెక్కడిది. వారు 'అమృత నికేతను'ని గ్రహించుట దుస్సాధ్యము. కొంతకాలము గడచిన వారికి అంతరాత్మ నశించును.

దైవాహ్వానితులగు పశ్చాత్తాపము పొందని మూఢులు పరమేశ్వరుని పొందనవసరము. హృదయ పశ్చాత్తాపము కొఱకు నేఁడు ఏకాంతసేవయే శరణ్యము. ఏకాంతసేవ చేతనే సఫలీకృత మనోరథులు మగుటకు వీలున్నది. అప్పుడే మన హృదయములు ప్రఫుల్లములగును. మనము ప్రేమానంద రాజ్యాధికారుల మగుదుము. నిశ్శబ్ద ప్రదేశము భక్తి పూరితము. అందు ఆత్మ భాష్పప్రవాహమున స్నానము జేయును. ఏకాంతవాసము మానవులకు సుధానందము నిచ్చును.

న. వెంకటరత్నం.

---

# బ్రాహ్మ సమాజము.

——:○:○:——

కాకినాడ బ్రాహ్మసమాజము.

[illegible] ఆదివారము సాయంకాలము అయిదున్నర గంటలకు సమాజ మందిరములో బ్రహ్మోపాసన యుత్సాహముతో జరిగెను. శ్రీయుత కామరాజు హనుమంతరావుగారు ప్రార్థన సలిపిరి. [illegible] ఆదివారము తిరిగి అయిదున్నర గంటలకు యుపాసన జరుగును. శ్రీయుత వి. వెంకటరాజు బి. ఏ. గారు ఆచార్యులుగా యుండ నంగీకరించిరి. సమాజ సభ్యు లందరు తప్పక దయచేయవలయును, సమాజాభిమాను లందరు కూడ విచ్చేయ ప్రార్థితులు. కాకినాడ బ్రాహ్మసమాజికులు గుంటూరులో జరిగిన పంచమోద్ధారణ అస్పృశ్యత నివారణల గురించి జరిగిన సభలకు తమ ఆనందమును ఆమోదమును తెలియ పరచుచు తంతివార్త నంపిరి. కాకినాడలో కూడ అట్టి సభలను జరుపుటకు ప్రయత్నములు జరుగనయి యున్నట్లు తెలియవచ్చుచున్నది.

వాడ్రేవు రామమూర్తి.

# జ్ఞానోదయము.

—:o:o:—

[శ్రీ జనమంచి సీతారామస్వామి గారు.]

... ... ... ...

...నాయనమ్మ మరణమునకు గ్రిందటి రాత్రి నేను "నిమతోళ" ఘట్టమున నొక మెతుక చాపమీద గూర్చుంటిని. అది పూర్ణిమారాత్రి. చంద్రోదయ మయ్యెను. శ్మశాన వాటిక సమీపమున నున్నది. పితామహి కొరకు మా వారు పరమేశ్వర పావన నామ సంకీర్తన మొనరించుచుండిరి.

"హరినామోచ్చారణము చేయుచు నేను ప్రాణములు విడుచునట్టి దిన మెన్నడైన వచ్చునా ?"

ఈ శబ్దములు నిశీథవాయువు వీచుచుండ మెల్లగ నా చెవి సోకెను. ఈ దివ్య సమయమున "సకల పదార్థములు మిథ్య"లను నూత్నభావం బొండు హఠాత్తుగా నా మనంబు జొచ్చెను. అంత నేనొక క్రొత్త మానిసిగా మారినట్లుంటిని. సంపదయం దింతింతన రాని యసహ్యత జనించునది. నేను గూర్చుండి యున్న మెతుక వెదురుచాపయే నా కుచితాసనంబుగ దోచె. అమూల్యములైన తివాసులు మొదలగునవి రోత బుట్టించున వయ్యెను. మదంతరంగమునందు మున్నెన్నడు ననభవింపని యానంద ముద్భవించె. అప్పుడు నేను బదు నెనిమిదేండ్ల వాడను.

రెండవ ప్రకరణము.

అప్పటి వరకు నేను భోగపరాయణుండనై కళ్మష జీవనమునందు మునిగి యుంటిని. ఆధ్యాత్మిక సత్యాన్వేషణ మెన్నడును నొనర్పలేదు. మత మనగా నేమి ? దైవమనగా నేమి ? ఏమియు నెరుగ. ఏమియు నేర్చుకొనలేదు. ఆ నాడట్లు దహన ఘట్టమున నే నొందిన యానందమును—నిజమైన, నిర్మలమైన యాధ్యాత్మికానందమును—నా మనస్సు పట్టలేకుండెను. భాషకు శక్తి చాలనప్పుడు, నే ననుభవించిన ప్రమోద మాహాత్మ్య మెట్టిదో యితరుల కెట్లు తెలుప గలను? అది తర్క వాదాదులచే నెవ్వరు బడయ నేరని సహజోత్పన్న నిర్గళానంద రసధార. దానిని ప్రవహింప జేయు నెవ్వ డెవ్వడని సర్వేశ్వరుడు సదా కనిపెట్టు కొని యుండును. అయిన యనుకూల సమయము వచ్చినది గదా యని నా కమ్మహాభాగ్యము ప్రసాదించెను.

ఇంక భగవంతుడు లేడని యెవడు నుడువ గలడు? అమ్మహానుభావుడు కలడనుటకు ప్రబల నిదర్శనము గలదు. నా బుద్ధివిశేషముచేత గాని, ప్రయత్నముచేత గాని, ప్రాప్తించిన యానందముగాదే యది. మరెందు మూలమున బొందితిని?

ఇట్టి యానంద వైరాగ్యములతో నే నర్ధరాత్రమున నింటికి మరలి వచ్చితిని. ఆ రాత్రి నాకు నిద్ర పట్టలేదు. అందుల కీ మానస స్థితియే హేతువు. రేయంతయు నాడెంద మానందకౌముదీ పరిపూరితమై భాసిల్లెను. తెల్లవారగనే నాయనమ్మ యెట్లున్నదో చూచుటకై నేను మరల నదీతీరమున కేగితిని. అప్పుడామె మరణవేదన నొందుచుండెను. మా వారామెను గంగా మధ్యంబునకు మోసికొనిపోయి "గంగా, నారాయణా, బ్రహ్మ" యను నామంబుల నుచ్చైస్స్వరంబున నుచ్చరించుచుండిరి. నేను దగ్గరకు వెళ్ళి చూడగా, నామె గుండెమీద జేయి వైచుకొని, నాల్గవ వ్రేలితో బైకి జూపుచు జబ్బును ద్రిప్పుచు, హరి నామ స్మరణ మొనరించుచు ప్రాణములు విడిచెను. ఆమె మరణ సమయమున బైకెత్తిన వ్రేలితో "అదియే పరలోకము—అదియే దైవము" అని నాకు గనబరచినట్లు తోచినది. నాయనమ్మ నాకీ జన్మమున నెట్టి మహోపకారిణి యైనదో భవిష్యజ్జన్మమునకు గూడ నట్టి మార్గదర్శిని యైనది గదా.

శ్రాద్ధకర్మ మహా వైభవముతో జరుపబడెను. మే మెడలెల్ల నూనెయును జనపును రాచుకొని, గంగాతటంబున కేగి యట "వృషాకాష్ఠము" యను ధాఢిగ బాతితిమి. ఈ పదిరోజులు మా గృహంబెంతయు గజిబిజిగా నుండెను. పిమ్మట నేను పితామహీ మరణ దినంబునకు గ్రిందటి రాత్రి గాంచిన యానందమును మరల గాంచవలయునని ప్రయత్నించితి. కాని యది నా కెన్నడు జేకూరలేదు. చిత్తము స్థైర్య శూన్యమై ప్రపంచము నెడ నొక విధమైన తూష్ణీంభావము చూపుచు దోలాయమానమై యుండెను. ఆనాటి రాత్రి మాత్ర మట్టి తూష్ణీంభావ మానందకందళితమై యొప్పారెను. కాని, యిప్పుడా యానంద మెందు లేని వాడ నగుటచే హృదయంబును గాఢతమం బావరించుకొని యున్నది. అప్పటి బ్రహ్మానంద భావమునకై తహతహ పడుచుంటిని. అన్యవిషయంబునరక్తి యెంత మాత్రము లేదు.

(మహర్షి స్వీయచరిత్ర నుండి అనువాదము.)

**The Dharma Sadhani Press,**

COCANADA.

*All Kinds of Job work in* **English & Telugu** *Promptly and Neatly executed.*


## ధర్మసాధని.

ప్రకటన పద్ధతి.

| | 1 సం॥ | ½ సం॥ | ¼ సం॥ |
|---|---|---|---|
| 1 కాలము. | రు. 60 | రు. 40 | రు. 24 |
| ½ ,, | ,, 40 | ,, 24 | ,, 16 |
| ¼ ,, | ,, 24 | ,, 16 | ,, 12 |

ప్రకటన ద్రవ్యము ముందుగానె చెల్లింపవలెను.

## విజ్ఞప్తి.

ధర్మసాధనికి చందాదారులుగ నుండగలరని తమకు తోచిన వారి విలాసముల తెలుప ప్రత్రికాభిమానుల వేల్లరు ప్రార్థితులు. ధ. సం.





## ఫౌంటెన్ కలము.

1. "బ్లాకు బర్డు" ఫౌంటెన్ పేనా, 12 ct బంగారు పాళీతో రు. 3- 0-0
2. "హార్డువేరు" ,, 14 ct ,, 2- 8-0
3. "శ్వాన్" ,, 14 ct బంగారు పాళీతోకలది. ప్రశస్తమైనది 5- 8-0
4. "వాటరు మేన్ ఐడియల్" ఫౌంటెన్ పేనా 14 క్యారట్ల బంగారు పాళీ కలది. మిక్కిలి నాణ్యము 7- 0-0
5. "ప్రీమియరు" ,, 14 ct బంగారు పాళీతో ,, 5- 8-0

కలములు వి. పి. గా పంపబడును. వ్రాయునపుడు, సన్నపుపాళీ కావలెనో, ముదురుపాళీ కావలెనో వ్రాయవలెయును. మేము మంచి కలములను చక్కగా పరిశోధించి చూచిన పిమ్మటనే పార్శిలు ద్వారా పంపుదుము. కావున, దూరముననుండున్నవారు నమ్మకము కలిగి బంగీలద్వారా వారికి కావలసిన కలములు తెప్పించుకొనవచ్చును. వలయువారు ఈక్రింది అడ్రెసుకు వ్రాసికొనవలెను.

యమ్. హెచ్. రావు అండు సన్సు, తపాలాపెట్టె నెం. 29, కాకినాడ.



# P. SUBBAROY.

**Ayurvedic Pharmacy,**

*Sri Venkatesa Perumal koil Sannithy,*

TANJORE.

# పి. సుబ్బరాయి.

ఆయుర్వేద ఔషధశాల,

శ్రీవెంకటేశ పెరుమాళ్ళు సన్నిధి, తంజాపూరు.

అరగజా:—ఇది యింకొక విధమయిన పరిమళద్రవ్యము. ఇది ప్రత్యేకముగా గాని గంధముతో నైనను గాని వుపయోగించవచ్చును. ఇది దేహమునకు పూసుకొనవచ్చును, ముఖమున తిలకము వుంచుకొనవచ్చును. మంచి పుడుపులకు, వస్త్రములకు, చేతిగుడ్డలకు పూయవచ్చును. దీని వాసన చెప్పతీరదు, దీనియొక్క పరిమళము పూసుకొనిన వెనుక మూడు దినములవరకు ప్రతినిత్యము స్నానము చేసినను వదలక దేహమునందే వాసనయుండును. వెల డబ్బి 1 కి అణాలు 8, 1 మొదలు 12 డబ్బీలవరకు వి. పి. శెలవులు అణాలు 8 ప్రత్యేకము.

అంబర్:—ఈసుగంధద్రవ్యమును కొంచెము మెత్తుకొని దుప్పటాలు, పుడుపులు మొదలగు వస్త్రములకు వేసినయెడల పరిమళముగా నుండుటయే గాక పురుగులు పుట్రలు చేఅకయుండును. ముఖమునకు శరీరమునకు పూసికొనినయెడల ముఖమునవచ్చెడు మొటిమెలు నల్లమచ్చలు దేహమున పొడలు మచ్చలు దురద మొదలైనవి నివారించి ముఖమునకు తేజస్సును నిచ్చును, తమలపాకులలో చేర్చి తాంబూలముతో వుపయోగించిన్నా మనోత్సాహము నిచ్చును. స్నానము చేయున వేడినీళ్లలో కలిపిన యెడల నీళ్లంతయు పన్నీరువలె సుగంధమైన వాసనగలిగి మనస్సును తృప్తిపరచి దేహశ్రమ నివారించును. వెల డబ్బి 1 కి అణాలు 8, 1 మొదలు 12 డబ్బీలవరకు వి. పి. శెలవులు అణాలు 8 ప్రత్యేకము.

బొల్లికి మందు.

పైన పూయవలసినది. ఒక వారము వాడిన తప్పక గుణమిచ్చును. మంటయుండదు. మెల్లగా పనిచేయును. అన్ని తత్వములకు సరిపడును. ఒక సీసా ఖరీదు రు 2—0—0. 1 మొదలు 3 సీసాలవరకు వి. పి. చార్జి 8 అణాలు అధికము. మావద్ద దొరకు ఆయుర్వేద ఔషధముల యొక్క కేటలాగు కోరువారికి ఉచితముగా పంపబడును.

# అమృతాంజనము.

## సుందరమైన 1921 ఉపయోగమైన

## క్రొత్త క్యాలండరు

విక్రయమునకు సిద్ధముగనున్నది.

క్యాలండరు వెల 1 కి 0=4=0 వి. పి. ఖర్చులు సహా 0=6=0

వెంటనె వ్రాసుకొనవలయును.

| తామర తైలము | పండ్లపొడి | మోహినీ తైలము |
|---|---|---|
| డబ్బి 1 కి, 0=6=0 | డబ్బి 1 కి, 0=2=0 | సీసా 1 కి, 0=12=0 |

## అమృతాంజనము

అన్ని నొప్పులకు దివ్యామృతము.

దగ్గు, శైత్యము పడిశము, రొమ్ము పడిశము, తలనొప్పి, వాయువు నొప్పులు, పోట్లు, బెణుకులు, బిళ్లలు మొదలగు నొప్పులకు దివ్యామృతము.

చక్కని డబ్బితో సహా వెల రూ. 0-10-0. డజను 1 కి రూ. 6-0-0 పోస్టు ఖర్చులు వేఱు.

## అమృతాంజనము డిపో,

౧౯, ఫోరిరోడ్డు, ఫోర్టు, బొంబాయి, ౬, తంబుశెట్టివీధి, మదాసు.

## ఇది చూడవద్దు

## చూచినచో మరువవద్దు

వైద్యరత్న పండిత

## డి. గోపాలాచార్యులుగారి

## ఇన్ఫ్లుయెన్జా

## కలరా ప్లేగు

వ్యాధులకు జగత్ప్రసిద్ధి చెందిన

## ఆయుర్వేద దివ్యౌషధములు

మా కలరా, ప్లేగు మందులకు

ముఖ్యపారితోషికము

20 వత్సరములుగ ఇండియా, బర్మా, సిలోన్, ఏడెన్ మొదలగు చోట్ల అనేక వేల ప్రాణులను, కలరా, ప్లేగునుండి

## కాపాడుటయే

కలరా సెట్టు 1-కి రు 1-2-0

ప్లేగు సెట్టు 1-కి రు 2-2-0

ఇన్ఫ్లుయెన్జా సెట్టు 1-కి రు 1-12-0

క్యాటలాగు ఉచితము. ప్యాకింగు పోస్టు ఖర్చులు ప్రత్యేకము.

## ఆయుర్వేదాశ్రమం,

41 ఆచారప్పన్ వీధి, జి. టి. మదరాసు.



**Reg. No. M. 1094.**

The Dharma Sadhani, Cocanada.

Printed & Published at the Dharma Sadhani Press Cocanada, by the Editor, K. Hanumanta Rao.


**To M.** **V. P.** *Rs.* *As.*

16 Jayanti Gaganna garu B. A., L. T.,
Head Master, V. H. School,
Rajahmundry.